బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

ముషీరాబాద్: హిందువుల పండుగలపై ఆంక్షలు విధించే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించాలని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రజలను కోరారు. దీపావళి పండుగ సందర్భంగా రాత్రి 10 తరువాత బాణాసంచాలు కాల్చవద్దని నిషేధ అంక్షలు విధించడం హిందువుల మనోభావాలను దెబ్బతీయడం కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముషీరాబాద్‌నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి పూస రాజు రూపొందించిన ఎన్నికల ప్రచార రథాలను శనివారం బాకారంలో ప్రారంభించారు. హిందువుల పండుగల సందర్భంగా పోలీసుల వేధింపులు పోవాలంటే ప్రజలు బీజేపీకి ఓటు వేసి అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

అవినీతి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృష్ణ యాదవ్

నల్లకుంట: రాష్ట్రంలో అవినీతిప్రభుత్వం రాజ్యమేలుతోందని, ప్రజలు ఓటు అనే ఆయుధంతో అవినీతి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అంబర్‌పేట బీజేపీ అభ్యర్థి కృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం ఓయూ ఎన్‌సీసీ చౌరస్తా సమీపంలో గల ఓ హోటల్‌లో విద్యావంతులు, మేధావుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. దీనికి హాజరైన కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. గతంలో మూడు పర్యాయాలు కిషన్ రెడ్డి, తాను మంత్రిగా, ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన సమయంలోనే నియోజక వర్గంలో ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించి, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. కాలేరు వెంకటేష్ ఎమ్మెల్యే గెలుపొందిన తర్వాత గడిచిన నాలుగున్నరేళ్లలో నియోజక వర్గాన్ని పట్టించుకోలేదన్నారు. సమావేశంలో నల్లకుంట కార్పొరేటర్ అమృత, బీజేపీ నియోజక వర్గం కన్వీనర్ శ్యామ్ రాజ్, వినోద్ యాదవ్ పాల్గొన్నారు.

గాంధీనగర్ డివిజన్‌లో బీజేపీ ప్రచారం



ఇస్త్రీ చేసి ఓటు అభ్యర్థిస్తున్న బీజేపీ అభ్యర్థి పూస రాజు

చిక్కడపల్లి: ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూసరాజు శనివారం గాంధీనగర్ డివిజన్‌లో పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్‌తో కలిసి హెబ్రోన్ చర్చి, వైజంక్షన్, గాంధీనగర్, ఆంధ్రాకేఫ్, గిరినగర్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి ఎన్నికల ప్రచారం చేశారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న తనకు డివిజన్ ప్రజలు పూర్తి మద్దతు పలకాలని కోరారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రత్నాసాయిచంద్ పర్యవేక్షణలో పార్టీ నాయకుల వినయ్‌కుమార్, టి.గోపాల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్‌నేత వాసుదేవరెడ్డి



ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజక వర్గ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్‌బీ మోహన్‌రెడ్డి కుమారుడు వాసుదేవరెడ్డి మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే ముఠాగోపాల్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారం రోజుల క్రితం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అడిక్‌మెట్‌లోని వాసుదేవరెడ్డి నివాసానికి వెళ్లి బీఆర్‌ఎస్‌లోకి రావాలని ఆహ్వానించారు. ఈ ఆహ్వానాన్ని మన్నించిన వాసుదేవరెడ్డి కేటీఆర్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ బీసీల పక్షపాతి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ నేత మురళీకృష్ణ

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ బీసీల అభివృద్ధి, సంక్షేమానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ నేత కేపీ మురళీకృష్ణ అన్నారు. శనివారం బర్కత్‌పురలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 60శాతం ఉన్న బీసీల అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉందన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ నేత వి.హనుమంతరావు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ బీసీలందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఆర్.నర్సింగ్ రావు ముదిరాజ్, బి.రాజు గౌడ్, కుతాడి రవికుమార్ పాల్గొన్నారు.

మోదీ చేసింది రాజకీయ ఉపన్యాసం

ముషీరాబాద్: మాదిగలను మరోసారి బీజేపీ, నరేంద్రమోడీ మోసం చేశారని పేరుకు మాదిగల సభ అని.. చేసింది మాత్రం రాజకీయ ఉపన్యాసం అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ అగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ మాట్లాడుతూ వర్గీకరణపై త్వరలో కమిటీ వేస్తామని ప్రధాని ప్రకటించడం మరోసారి మాదిగలను మోసం చేయడమేనన్నారు. ఓట్ల కోసమే మాదిగల విశ్వరూప సభ నిర్వహించిందని కృష్ణమాదిగ బీజేపీకి మద్దతుగా బీజేపీ ఓట్ బ్యాంకుగా మార్చాలని భావిస్తున్నాడని దీనికి కృష్ణమాదిగ సమాధానం చెప్పాలన్నారు. సభ జరుగుతున్న సమయంలోనే ఒక మహిళ ప్రధాని ప్రకటించిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ టవరెక్కి ఆత్మహత్యానికి ప్రయత్నించిన సంఘటన మన కళ్లముందే కనబడిందన్నారు. ప్రధాని మాటల్లోనే వర్గీకరణ హామీ నమ్మశక్యంగా లేదని ఈ ప్రయత్నం జరిగిందని స్పష్టమవుతుందన్నారు.

లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్

కవాడిగూడ: తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో ముదిరాజ్‌ల ఓట్లకోసం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ ముదిరాజ్‌లను బీసీ-డి నుంచి ఏ గ్రూప్‌లోకి మార్చుతామని హామీ ఇవ్వడం తగదని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం యువజన విభాగం అధ్యక్షుడు అంబటి సుధాకర్ గంగపుత్ర అన్నారు. తమకు వ్యతిరేకంగా పనిచేసే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గంగపుత్రులకు పిలుపునిచ్చారు. శనివారం కవాడిగూడ డివిజన్ పరిధిలోని బండమైసమ్మ నగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు మాత్రమే కాంగ్రెస్ పార్టీ నేతలు బీసీ డిక్లరేషన్ పేరుతో కొత్తనినాదం అందుకోవడం సిగ్గుచేటు అన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడిద్దాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో పాలక పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్, బీజేపీలకు వ్యతిరేకంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ మతోన్మాద పార్టీలను వ్యతిరేకించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత 10 ఏళ్లుగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండానే మూడవసారి అధికారంలోకి రావడానికి కుట్రలు చేస్తుందని విమర్శించారు.

ఎత్తుకు పైఎత్తు..

అంబర్‌పేట్‌లో కొత్త పుంతలు తొక్కుతున్న రాజకీయం

- అసంతృప్తులకు గాలం వేసే ప్రధాన పార్టీల అభ్యర్థులు
- రాత్రికి రాత్రి చక్రం తిప్పుతున్న నేతలు

అంబర్‌పేట: అంబర్‌పేట రాజకీయ పరిణామలు రోజురోజుకూ మారుతున్నాయి. ప్రధానంగా మూడు పార్టీల అభ్యర్థులు ఎన్నికల్లో గట్టెక్కేందుకు కొత్త కొత్త వ్యూహాలకు పదును పెడుతున్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఒకవైపు ప్రచారం చేసుకుంటూనే మరో వైపు ఎదుటి పార్టీలను బలహీన పరిచేందుకు ప్రణాళికలకు పదును పెడుతున్నారు. నామినేషన్ ఘట్టం పూర్తి కాగానే ఇక సమరమే అంటూ రాజకీయ ఎత్తుగడలకు తెరలేపారు.

జంగ్ 2023 తెలంగాణ

బీఆర్‌ఎస్ ఓట్లపై బీజేపీ దృష్టి..

బీజేపీ అభ్యర్థి కృష్ణయాదవ్ తన ఎత్తుగడలను వేస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రచారాన్ని చేస్తూనే ఖాళీ సమయాల్లో తన పాత అనుభవాన్నీ, అనుబంధాల అస్త్రాలను ప్రయోగిస్తున్నారు. అంబర్‌పేట నుంచే అతను ఎమ్మెల్యేగా, మంత్రిగా వ్యవహరించి చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తుకు తెస్తున్నారు. దానికి తోడు బీజేపీ క్యాడర్ కలిసి వచ్చే అంశంగా ఉంది. కాగా ఐదు సంవత్సరాలుగా బీజేపీ క్యాడర్ కొంత నిరాశగా ఉంది. మరికొంతమంది బీఆర్‌ఎస్‌లో చేరారు. బీజేపీ ఎంత చెప్పినా బీఆర్‌ఎస్ సంప్రదాయ ఓటర్లను తమ వైపు తిప్పుకోవడం అంత సులువుగా కనిపించడంలేదు. బీఆర్‌ఎస్ సంప్రదాయ ఓటర్లను తిప్పుకోవడం అతి పెద్ద సవాల్.

ఓటు బ్యాంకు ధీమాతో బీఆర్‌ఎస్

బీఆర్‌ఎస్ అధికార పార్టీ కావడంతో ఎన్నికలను సులువుగా ఎదుర్కొవచ్చనే ధీమాగా ఉంది. అంబర్‌పేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ గత ఐదుళ్లేగా చేసిన అభివృద్ధితో పాటు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారులు తన విజయానికి దోహదపడుతారని భావిస్తున్నారు. కేసీఆర్ పేరుపై గెలువచ్చనే ధీమాగా ఉన్నారు. కాగా బీఆర్‌ఎస్ అసంతృప్త నేతలతో ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే అంబర్‌పేట డివిజన్ మాజీ కార్పొరేటర్, నల్లకుంట డివిజన్ మాజీ కార్పొరేటర్ కాంగ్రెస్‌లో చేరారు. వీరి వెంట పలువురు బీఆర్‌ఎస్ క్రియాశీల నేతలు సైతం కాంగ్రెస్‌లో చేరడం గులాబీ పార్టీకి కలవర పెట్టే అంశం.

రెండోసారి విజయం నాదే



కాచిగూడ, లింగంపల్లిలో పాదయాత్ర చేస్తున్న బీఆర్‌ఎస్ అంబర్‌పేట అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: తనను ప్రజలు రెండోసారి ఆదరిస్తారనే నమ్మకం ఉందని అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం కాచిగూడ డివిజన్ లింగంపల్లి, బసంత్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బస్తీల్లో, కాలనీల్లో మహిళలు ఎమ్మెల్యేకు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఉమ్మడి రాష్ట్రంలో జరగని అభివృద్ధి సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో సాధించి చూపెట్టిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్ యాదవ్, దిడ్డి రాంబాబు, ప్రతిభ పాల్గొన్నారు.

ముఠా గోపాల్ గెలవాలని యాదగిరి గుట్టకు పాదయాత్ర



యాదగిరిగుట్టకు పాదయాత్రను ప్రారంభిస్తున్న ముఠా జైసింహ

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే ముఠా గోపాల్ రెండవసారి విజయం సాధించాలని, ముఖ్యమంత్రి కేసిఆర్ మూడవసారి ముఖ్యమంత్రై హ్యాట్రిక్ సాధించాలని కోరుతూ నాగమయ్యకుంటకు చెందిన ఎం.వినోద్‌కుమార్ యాదగిరి గుట్ట వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రను శనివారం ఉదయం నాగమయ్యకుంట వద్ద బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ కొబ్బరికాయకొట్టి ప్రారంభించారు.

ఆరు నెలల్లోనే బీసీ రిజర్వేషన్లు పెంచుతాం

ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్



ఎం.అంజన్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న ఓ మహిళ

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే బీసీ రిజర్వేషన్లు పెంచుతామని ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాంనగర్ డివిజన్‌లోని ఎస్‌ఆర్‌టీ కాలనీ, హరినగర్, కృష్ణనగర్, ఎస్‌ఆర్‌కె నగర్, రిసాల కుర్షిద్‌జాయి, జెమిస్తాన్‌పూర్ తదితర ప్రాంతాలో గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని ప్రజలకు ఆయన కోరారు. బీసీ జనగణన చేయడంలో బీజేపీ విఫలమైందని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేస్తామన్నారు. మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పనాయాదవ్, వాజీద్‌హుస్సేన్ పాల్గొన్నారు.

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక డ్రైవ్

కాచిగూడ: హైదరాబాద్ డివిజనల్ రైల్వే పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న 492 మంది ప్రయాణికులపై కేసులు నమోదు చేసి రూ.2,71,665 అపరాధ రుసుం వసూలు చేసినట్లు రైల్వే అధికారులు శనివారం ప్రకటించారు. ఈ నెల 10వ తేదీన కాచిగూడ రైల్వే స్టేషన్‌తో పాటు కర్నూల్ సిటి, నిజామాబాద్ సెక్షన్ వైపు వెళ్లే రైళ్లల్లో డ్రైవ్ నిర్వహించినట్లు వారు తెలిపారు.

విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి



విజ్ఞతకు అవార్డును అందజేస్తున్న జస్టిస్ వామన్‌రావు

కాచిగూడ: విద్యార్థులను రేపటి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతరమైన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వామన్‌రావు అన్నారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా నవ భారతి నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనదేశంలో విద్యాభివృద్ధికిబాటలు వేసిన తొలి బాటసారి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అని అన్నారు. ఈ సందర్భంగా విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న ప్రముఖ విద్యావేత్త జక్కుల విజ్ఞతకు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ స్మారక అవార్డును ఆయన అందజేశారు.

బీజేపీ ప్రొటోకాల్ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్‌గా రాహుల్



కాచిగూడ: భారతీయ జనతా పార్టీ ప్రొటోకాల్ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ గా డాక్టర్ ఎస్.రాహుల్‌ను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బర్కత్‌పుర లోని పార్టీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు.

నీతివంతమైన పాలనతోనే అభివృద్ధి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్రం, రాష్ట్రంలోని ప్రభుత్వాలు పారదర్శకతకు పెద్దపీట వేస్తూ చిత్తశుద్ధితో పాలన సాగిస్తే ప్రజలకు మెరుగైన ఫలితాలు అందుతాయని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వర్‌రావు అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని బీఆర్ అంబేద్కర్ కళాశాలలో పౌర కేంద్రీకృత పాలన పారదర్శకత–అవశ్యకత–సవాళ్లు, సంస్కరణలు అనే అంశంపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న సదస్సు కార్యక్రమం శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వర్‌రావు మాట్లాడుతూ... అన్ని ప్రభుత్వ శాఖలు బాధ్యతాయుతంగా పని చేసినప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందన్నారు. మెరుగైన సమాజం ఏర్పాటుకు కృషితో పాటు చట్టాలు, హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించేలా న్యాయశాస్త్రం అభ్యసిస్తున్న విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. అనంతరం పలువురు లా విద్యార్థులు పరిశోధనా పత్రాలను సమర్పించారు.

మోదీవి మోసపూరిత వాగ్దానాలు

నల్లకుంట: మాదిగ జాతిని మంద కృష్ణ మాదిగ బీజేపీకి తాకట్టు పెట్టారని దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పి. గెల్వయ్య ఆరోపించారు. శనివారం నల్లకుంట తిలక్ నగర్‌లో దళిత సంఘాల ఐక్య వేదిక సమావేశం జరిగింది. దీనికి హాజరైన గెల్వయ్య జేఏసీ ఉపాధ్యక్షుడు ఆర్కే బాబు, గాలపల్లి శంకర్, జిల్లా అధ్యక్షుడు రెడపాక రాముతో కలిసి మాట్లాడారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మందకృష్ణ మాదిగ మోస పూరిత మాటలను దళితులెవరూ నమ్మకూడదని కోరారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందనే ఉద్దేశ్యంతో ఎమ్మార్పీఎస్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఆ సమయంలో అన్ని దళిత సంఘాలు ఎమ్మార్పీఎస్‌కు మద్దతు తెలిపాయన్నారు. అన్ని పార్టీలు ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి దళితులను మోసం చేస్తున్నాయని, ఆ మోసంలో భాగంగానే నరేంద్ర మోదీ సభను పెట్టి మభ్యపెట్టే వాగ్దానాలు చేశారని తెలిపారు. సమావేశంలో దళిత సంఘాల ఐక్య వేదిక ఉపాధ్యక్షుడు జాకీ కుమార్, సహాయ కార్యదర్శి మేడి ప్రసాద్, భీష్మదేవ్, పాండురంగం, క్రాంతి, సతీష్ పాల్గొన్నారు.

చంద్ర పుల్లారెడ్డికి ఘన నివాళి



చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభలో మాట్లాడుతున్న అరుణోదయ విమలక్క

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న అమరజీవి చంద్ర పుల్లారెడ్డి అని అరుణోదయ సంస్కృతిక సమైక్య అధ్యక్షురాలు విమలక్క అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అమరుల స్మారక కమిటీ తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో చంద్ర పుల్లారెడ్డి 39వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విమలక్క మాట్లాడుతూ గోదావరి లోయ విప్లవ స్రవంతికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించి భారత విప్లవోద్యమ అగ్రశ్రేణి నాయకుల్లో చంద్ర పుల్లారెడ్డి ఒకరని కొనియాడారు. గద్దం ఝాన్సీ, గుర్రం విజయ్‌కుమార్, వటోళ్ల నాగిరెడ్డి, కట్ట భగవంత్‌రెడ్డి, గంగా, మల్లేష్, అనసూయ, మన్సూర్, విజయ్, యాకయ్య పాల్గొన్నారు.

బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న దాసు సురేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జరగనున్న ఎన్నికల్లో బీసీలను పెద్ద ఎత్తున అసెంబ్లీలోకి అడుగుపెట్టేలా కృషి చేస్తున్నామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాసు సురేష్ మాట్లాడుతూ బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా కాకుండా రాజకీయ అవకాశం కల్పించాలని లేకుంటే ఆయా పార్టీలకు గుణపాఠం తప్పదన్నారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగా బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వ్డ్ స్థానాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయ అవకాశాలు ఇవ్వకుండా చేస్తున్న ఆధిపత్య కులాలను ఓడిస్తామని హెచ్చరించారు. రాజ్యాధికార సమితి గ్రేటర్ అధ్యక్షురాలు బండారు పద్మవతి, మహిళా ప్రధాన కార్యదర్శి భూషిక స్వప్న, మీడియా రాష్ట్ర కన్వీనర్ మారెపల్లి లక్ష్మణ్, యారసాలి దుర్గేష్, దాసు బలరామ్, బొమ్మ నరేందర్, మంద వెంకట స్వామి, వారసాని రాధాకృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

శివుడికి విశేష అభిషేకం



నల్లకుంట: మాస శివ రాత్రిని పురస్కరించుకొని శనివారం న్యూనల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా అక్కడి ప్రాంగణంలో గల పర్వత వర్ధిని సహిత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివుడికి విశేష అభిషేకాలు, పూజలు, అర్చనలు నిర్వహించారు.

కాంగ్రెస్ వెంటే పద్మశాలీలు

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజవర్గంలోని పద్మశాలీలు కాంగ్రెస్ పార్టీ వెంటే ఉన్నారని నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, పద్మశాలి సంఘంనేత గుర్రం శంకర్ తెలిపారు. శనివారం జవహర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న సంగిశెట్టి జగదీశ్వర్‌రావు బీఆర్‌ఎస్‌లో చేరారని అయితే తన వెంట పద్మశాలీలు అందరూ బీఆర్‌ఎస్‌లో చేరారని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పద్మశాలీలు అందరూ కాంగ్రెస్ మద్దతుగా ఉన్నారన్నారు.